# నవతరం

తెలుగు దినపత్రిక

పబ్లిషింగ్ : రాజమహేంద్రవరం | సంపుటి : 12 | సంచిక : 138 | RNI NO :APTEL /2018 /76747 | బుధవారం 08 - 07 - 2026 | పేజీలు : 04 | వెల : 02 రూ..

Published From: Srikakulam, Parvathipuram Manyam,Vizianagaram,Visakhapatnam,Alluri Sitharama Raju,Anakapalli,Kakinada,East Godavari ,Konaseema,Eluru,West Godavari,NTR,Krishna,Guntur,Bapatla,Nellore,Prakasam,Kurnool,Nandyal,Sri Sathya Sai,YSR,Annamayya,Tirupati,Chittoor





# రైతులకు రుణమాఫీ

**భూసమీకరణ రెండో దశ రైతుల రుణమాఫీకి ఆమోదం**

- జనవరి 6 వరకు తీసుకున్న రుణాలే మాఫీ
- సీఆర్డీఏ 63వ సమావేశంలో కీలక నిర్ణయం
- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సమావేశం
- భూములిచ్చిన రైతులకు ఏటా రూ.40 వేల కౌలు
- కౌలు చెల్లింపులు పదేళ్లపాటు కొనసాగింపు
- గ్రామ కంఠం భూములకు ఏటా రూ.10 వేల సాయం
- దేవాదాయ శాఖకు రూ.159 కోట్లు చెల్లింపుకు ఆమోదం
- 25 టౌన్‌షిప్‌లలో అంతర్జాతీయ పాఠశాలలు
- భూసమీకరణకు రాని వారిపై భూసేకరణ హెచ్చరిక
- రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న నారాయణ
- అమరావతి నిర్మాణ వేగానికి సీఆర్డీఏ నిర్ణయాలు

**ఆంధ్రప్రదేశ్, నవతరం**

రాజధాని అమరావతి నిర్మాణంలో భూసమీకరణ రెండో దశలో కొత్తగా ల్యాండ్ పూలింగ్ జరిగే గ్రామాల్లోని రైతులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీపికబురు అందించింది. భూసమీకరణ కింద భూములు ఇచ్చే ఆయా రైతులు ఈ ఏడాది జనవరి 6వ తేదీ వరకు తీసుకున్న రుణాలను మాఫీ చేసేందుకు రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్డీఏ) ఆమోదం తెలిపింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన సీఆర్డీఏ



# ఈ ఏడాది రాయల సీమకు ఎల్‌నినో దెబ్బ

- ఏపీపై ఎల్‌నినో తీవ్ర ప్రభావం.. 11 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు
- ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో భారీగా వర్షపాతం లోటు
- వర్షాభావ పరిస్థితులపై హోంమంత్రి వంగలపూడి అనిత సమీక్ష
- ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశం.....
- విపత్తుల వల్ల ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచన




**ఆంధ్రప్రదేశ్, నవతరం**

ఆంధ్రప్రదేశ్‌పై ఎల్‌నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. దీని కారణంగా రాష్ట్రంలోని 11 జిల్లాల్లో, ముఖ్యంగా రాయలసీమలో, సాధారణం నుంచి తీవ్రస్థాయిలో వర్షపాతం లోటు నమోదైందని అధికారులు తెలిపారు. మంగళవారం తాడేపల్లిలోని ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) ప్రధాన కార్యాలయంలో హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. నైరుతి రుతుపవనాల పనితీరు, ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై ఈ సమావేశంలో చర్చించారు. ఎల్‌నినో కారణంగా రాయలసీమ జిల్లాలు తీవ్రంగా ప్రభావితమైనట్లు సమావేశంలో గుర్తించారు. ముఖ్యంగా శ్రీ సత్యసాయి, అనంతపురం, అన్నమయ్య జిల్లాల్లో తీవ్ర వర్షాభావం ఉండగా.. కర్నూలు, నంద్యాల, చిత్తూరు, కడప, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో సాధారణ లోటు నమోదైనట్లు అధికారులు వివరించారు. ఈ నేపథ్యంలో కరవు పీడిత మండలాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి అనిత అధికారులను ఆదేశించారు. మరోవైపు, విపత్తుల కారణంగా ఎలాంటి ప్రాణనష్టం జరగకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో 24 గంటలూ పనిచేసేలా ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వరద ముప్పు ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత

# డీఎంకేపై సుప్రీంకోర్టు ఆగ్రహం

**విజయ్ పర్యటనపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ డీఎంకే పిటిషన్**
**సీఎం పర్యటనలపై ఆంక్షలు విధించాలని విన్నపం**
**సాక్షులపై సీఎం ప్రభావం చూపుతారని డీఎంకే వాదన**
**రాజకీయ ప్రత్యర్థుల వ్యాఖ్యలపై ఎలా ఆదేశాలిస్తామని కోర్టు ప్రశ్న**
**కరూర్ తొక్కిసలాట కేసు నేపథ్యంలో పిటిషన్**

**జాతీయం, నవతరం**

తమిళనాడు ప్రతిపక్ష పార్టీ డీఎంకేపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి విజయ్ పర్యటనలు, ప్రసంగాలపై ఆంక్షలు విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం, రాజకీయ విభేదాలను పరిష్కరించుకోవడానికి సుప్రీంకోర్టును వేదికగా మార్చొద్దని స్పష్టం చేసింది. ఈ వ్యాఖ్యలతో డీఎంకే వెనక్కి తగ్గి తన పిటిషన్‌ను



# ఎల్జీకి మంత్రి లోకేశ్ ఆహ్వానం

**దక్షిణ కొరియాలో పర్యటిస్తున్న మంత్రి లోకేశ్**
**ఎల్జీ ఎలక్ట్రానిక్స్, ఎల్జీ కెమ్ ఉన్నతాధికారులతో సమావేశం**
**విశాఖలో జీసీసీ, మూలపేటలో నాఫ్తా క్రాకర్ కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు**
**శ్రీసిటీలో రూ.5000 కోట్లతో ఎల్జీ యూనిట్.. ఈ ఏడాది నుంచే ఉత్పత్తి**
**ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చిన ఎల్జీ యాజమాన్యం**



## నాయకత్వానికి
# గుర్తింపు

- భారత్, ఇండోనేషియా మధ్య రక్షణ, వాణిజ్యం సహా పలు రంగాల్లో కీలక ఒప్పందాలు
- ప్రధాని మోదీకి ఇండోనేషియా అత్యున్నత పౌర పురస్కారం 'బింటాంగ్ ఆదిపుర్ణ' ప్రదానం
- ఇండోనేషియాకు బ్రహ్మోస్ క్షిపణుల విక్రయానికి కీలక రక్షణ ఒప్పందంపై సంతకాలు
- సెయిల్, క్రాకటౌ స్టీల్ మధ్య వ్యూహాత్మక జాయింట్ వెంచర్‌కు అంగీకారం....

**జాతీయం, నవతరం**

భారత్, ఇండోనేషియా తమ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సరికొత్త శిఖరాలకు చేర్చాయి. రక్షణ, వాణిజ్యం, సాంకేతికత, ఆరోగ్యం, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని విస్తృతం చేసే లక్ష్యంతో ఇరు దేశాలు పలు కీలక ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఈ చారిత్రక పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీకి







# నేను షాకయ్యా

**రాజమహేంద్రవరంలో ఇసుక లారీల వల్ల దెబ్బతిన్న రోడ్డు**

**టీడీపీ కార్యకర్త ట్వీట్‌పై స్పందించిన మంత్రి నారా లోకేశ్**
**వెంటనే రోడ్డు నిర్మించాలని అధికారులకు తక్షణ ఆదేశాలు**
**ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత అని స్పష్టీకరణ**
**గత రెండేళ్లుగా పరిష్కారం కాని సమస్యపై మంత్రి జోక్యం**

**ఆంధ్రప్రదేశ్, నవతరం**

సోషల్ మీడియాలో వచ్చిన ఒక ఫిర్యాదుపై రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే స్పందించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పరిధిలో ఇసుక లారీల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న రోడ్డు సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. టీడీపీ మహిళా కార్యకర్త జాహ్నవి చేసిన ట్వీట్‌కు స్పందించిన ఆయన, ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళితే.. రాజమహేంద్రవరం సమీపంలోని కాతేరు, మల్లయ్యపేట ప్రాంతాల్లోని రోడ్లు ఇసుక లారీల నిరంతర రాకపోకలతో పూర్తిగా ధ్వంసమయ్యాయి. రోడ్లన్నీ గుంతలమయంగా మారి, వాహనాల రాకపోకలతో పెద్ద ఎత్తున దుమ్ము లేస్తోంది. ఈ దుమ్ము స్థానికుల కళ్లలోకి, ముక్కుల్లోకి చేరి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు కారణమవుతోంది. ఈ సమస్యపై టీడీపీ కార్యకర్త జాహ్నవి గత నెలలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌లను ట్యాగ్ చేస్తూ ఎక్స్ లో ఫిర్యాదు చేశారు. గత రెండేళ్లుగా ఈ సమస్య గురించి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం

# ఎల్జీకి మంత్రి లోకేశ్ ఆహ్వానం




**ఆంధ్రప్రదేశ్ :** ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తన దక్షిణ కొరియా పర్యటనలో కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు. పర్యటనలో భాగంగా ఆయన ప్రపంచ ప్రఖ్యాత సంస్థ ఎల్జీ ఎలక్ట్రానిక్స్, ఎల్జీ కెమ్ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందాలతో సియోల్‌లో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విశాఖపట్నం, శ్రీసిటీ, మూలపేట కేంద్రాలుగా రాష్ట్రంలో భారీ ప్రాజెక్టులు చేపట్టేందుకు గల అవకాశాలను ఆయన వివరించి, పెట్టుబడులకు ఆహ్వానం పలికారు.

**విశాఖలో జీసీసీ.. ఎల్జీ ఎలక్ట్రానిక్స్‌కు లోకేశ్ ప్రతిపాదనలు :** సియోల్‌లోని ఎల్జీ ట్విన్ టవర్స్‌లో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ గ్లోబల్ సీఈవో ల్యూ జె చెయోల్, ఇండియా సీఈవో హాంగ్ జు జియోన్‌లతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్జీ సంస్థ తన నోయిడా, బెంగళూరు ప్రాజెక్టుల తరహాలో విశాఖపట్నంలో ఒక గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ) లేదా ఇంజనీరింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనితో పాటు శ్రీసిటీ, దాని పరిసర ప్రాంతాలలో డిస్‌ప్లే మాడ్యూల్స్, సెన్సర్లు, పవర్ ఎలక్ట్రానిక్స్ వంటి విడిభాగాల తయారీ యూనిట్‌ను స్థాపించే అవకాశాలను పరిశీలించాలని కోరారు. రాష్ట్రంలో ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించేందుకు ఐఓటీ, రోబోటిక్స్ వంటి అత్యాధునిక రంగాలలో ఇన్నోవేషన్ ల్యాబ్‌ల ఏర్పాటుకు రీసెర్చ్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్)తో కలిసి పనిచేయాలని సూచించారు. క్యారియర్ సంస్థ తరహాలో వాణిజ్య అవసరాల కోసం చిల్లర్ మాన్యుఫ్యాక్చరింగ్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ సమావేశంలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా సీఈవో హాంగ్ జు జియోన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం భారత రిఫ్రిజిరేటర్ మార్కెట్‌లో 28 శాతం, వాషింగ్ మెషీన్ల విభాగంలో 33.5 శాతం వాటాతో ఎల్జీ అగ్రస్థానంలో ఉందని తెలిపారు. ఇప్పటికే శ్రీసిటీలో రూ.5,000 కోట్ల భారీ వ్యయంతో తమ మూడో ఉత్పాదక కేంద్రాన్ని నిర్మిస్తున్నామని, దీని ద్వారా సుమారు 1,500 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభిస్తాయని వివరించారు. ఈ ఏడాది చివరికల్లా ఈ యూనిట్‌లో వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించి ఏసీ కంప్రెసర్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు తయారు చేస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన తాజా ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

**మూలపేటలో నాఫ్తా క్రాకర్.. ఎల్జీ కెమ్‌కు ఆహ్వానం :** పర్యటనలో భాగంగా లోకేశ్, ఎల్జీ కెమ్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్ యున్-జు కోహ్ బృందంతో కూడా భేటీ అయ్యారు. కాకినాడ పోర్టు సమీపంలో పాలీస్టైరిన్ తయారీ కేంద్రాన్ని, మూలపేట పోర్టు కేంద్రంగా ప్రపంచ స్థాయి నాఫ్తా క్రాకర్ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని కోరారు. ఎలక్ట్రిక్ వాహన రంగానికి ఊతమిచ్చేలా రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ క్యాథోడ్ యాక్టివ్ మెటీరియల్, సెల్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. వీటితో పాటు మూలపేటలో బయో-ఇథనాల్, సస్టెయినబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ (ఎస్ఏఎఫ్) ఉత్పత్తిపై దృష్టి సారించి జీవ ఇంధనాల తయారీ కేంద్రం, ప్లాస్టిక్ వ్యర్థాలను పునర్వినియోగంలోకి తెచ్చేందుకు రీసైక్లింగ్, పైరోలిసిస్ ప్లాంట్లను ప్రభుత్వ భాగస్వామ్యంతో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి యున్-జు కోహ్ స్పందిస్తూ, గతంలో విశాఖపట్నం గోపాలపట్నంలోని ఎల్జీ పాలిమర్స్ ప్లాంట్ ద్వారా కీలకమైన పాలిమర్ భాగాలను సరఫరా చేశామని గుర్తుచేశారు. ప్రస్తుతం శ్రీసిటీలో ఏబీఎస్ కాంపౌండ్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన నూతన ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశాలు రాష్ట్రానికి మరిన్ని భారీ పెట్టుబడులను ఆకర్షించే దిశగా సానుకూల వాతావరణాన్ని సృష్టించాయని అధికారులు భావిస్తున్నారు.

# నేను షాకయ్యా

లభించలేదని జాహ్నవి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దలు ఎవరైనా ఆ మార్గంలో పర్యటిస్తే మాత్రమే తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారని, ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటన సందర్భంగా కూడా అలాగే చేశారని ఆమె పేర్కొన్నారు. సమస్య తీవ్రతరం కావడంతో జాహ్నవి తాజాగా మరోసారి ట్వీట్ చేశారు. తాను మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తే, అది గనుల శాఖ పరిధిలోకి వస్తుందని ఆయన చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. దుమ్ము, ధూళి, ప్రమాదాలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ ట్వీట్‌పై మంత్రి నారా లోకేశ్ వెంటనే




స్పందించారు. “ఇది చూసి షాకయ్యాను. ఇది ప్రజల భద్రతకు, ఆరోగ్యానికి చాలా ప్రమాదకరం” అని పేర్కొన్నారు. తక్షణమే రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్‌తో పాటు గనుల శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని, దెబ్బతిన్న రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆయన ఆదేశించారు. కేవలం తాత్కాలికంగా కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. తమ సమస్యపై మంత్రి లోకేశ్ వేగంగా స్పందించి ఆదేశాలు జారీ చేయడంతో జాహ్నవి ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. మంత్రి జోక్యంతో తమ దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం లభిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# డీఎంకేపై సుప్రీంకోర్టు ఆగ్రహం



ఉపసంహరించుకుంది. కరూర్ తొక్కిసలాట కేసులో సీబీఐ దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో ముఖ్యమంత్రి విజయ్ జులై 10న అక్కడ పర్యటించనున్నారని డీఎంకే కోర్టు దృష్టికి తీసుకొచ్చింది. మృతుల కుటుంబాలకు ఉద్యోగ నియామక పత్రాలు, ఆర్థిక సాయం అందించే కార్యక్రమం దర్యాప్తులో ఉన్న సాక్షులపై ప్రభావం చూపే అవకాశం ఉందని వాదించింది. అంతేకాదు టీవీకే నేత ఆదవ్ అర్జున చేసిన వ్యాఖ్యలపైనా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ప్రసంగాలు, పర్యటనలపై ఆదేశాలు ఇవ్వాలని కోరింది. అయితే ఈ వాదనలను సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. “ముఖ్యమంత్రి ఏం చేయాలో కూడా సుప్రీంకోర్టే చెప్పాలా? ఆయన ఈ కేసులో నిందితుడు కాదు. స్వేచ్ఛగా మాట్లాడే హక్కుపైనా ఆంక్షలు కోరుతున్నారా? రాజకీయ ప్రత్యర్థుల వ్యాఖ్యలపై ఈ కోర్టు ఎలా ఆదేశాలు ఇస్తుంది?” అంటూ ధర్మాసనం ప్రశ్నించింది. దీంతో డీఎంకే తన పిటిషన్‌ను వెనక్కి తీసుకునేందుకు అనుమతి కోరగా కోర్టు అంగీకరించింది. గతేడాది సెప్టెంబరులో కరూర్‌లో విజయ్ ఎన్నికల ప్రచార సభ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. తొక్కిసలాటకు టీవీకే కార్యకర్తల నిర్లక్ష్యమే కారణమని డీఎంకే ఆరోపిస్తుండగా, ఇదంతా డీఎంకే రాజకీయ కుట్రేనని విజయ్, టీవీకే నేతలు ఆరోపిస్తున్నారు.

# నాయకత్వానికి గుర్తింపు

ఇండోనేషియా తమ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన ‘బింటాంగ్ ఆదిపుర్ణ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేషియా’ను ప్రదానం చేసి అరుదైన గౌరవాన్ని అందించింది. జకార్తా పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ ఒప్పందాలు కుదిరాయి. రక్షణ రంగంలో సహకారం ఈ ఒప్పందాల్లో ప్రధానంగా నిలిచింది. సముద్ర భద్రత, భద్రతా సహకారంపై ఉన్న అవగాహన ఒప్పందాన్ని ఇరు దేశాలు పొడిగించాయి. దీనికితోడు, ఇండోనేషియాకు బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థను అందించేందుకు ఒక రక్షణ కాంట్రాక్టుపై సంతకాలు జరిగాయి. అదేవిధంగా, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్), ఇండోనేషియాకు చెందిన రిపబ్లికోర్ప్ మధ్య గగనతలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణుల సహకారంపైనా ఒక ఒప్పందం కుదిరింది. వాణిజ్య, ఆర్థిక రంగాల్లోనూ వ్యూహాత్మక భాగస్వామ్యానికి బలమైన పునాది పడింది. ఖనిజాలు, ఉక్కు సరఫరా వ్యవస్థలలో సహకారాన్ని మరింతగా పెంచుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. ఇందులో భాగంగా స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్, ఇండోనేషియాకు చెందిన పీటీ క్రాకటౌ స్టీల్ మధ్య ఒక వ్యూహాత్మక జాయింట్ వెంచర్ ఏర్పాటు కానుంది. వీటితో పాటు విపత్తు నిర్వహణ, వ్యవసాయం, టెలికమ్యూనికేషన్స్, వైద్య ఉత్పత్తుల నియంత్రణ, ఎన్నికల నిర్వహణ వంటి అంశాలపై కూడా పలు అవగాహన ఒప్పందాలు జరిగాయి.




**మోదీకి అరుదైన గౌరవం:** జకార్తాలోని అధ్యక్ష భవనంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో.. ప్రధాని మోదీకి ‘బింటాంగ్ ఆదిపుర్ణ’ పురస్కారాన్ని స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రబోవో మాట్లాడుతూ.. “ఇండో-పసిఫిక్ ప్రాంతంలో స్థిరత్వాన్ని నెలకొల్పే శక్తిగా భారత్ పోషిస్తున్న కీలక పాత్రకు, ద్వైపాక్షిక సంబంధాలను మార్చడంలో ప్రధాని మోదీ వ్యక్తిగత నాయకత్వానికి ఈ పురస్కారం ఒక గుర్తింపు. మా గణతంత్రం అందించే అత్యున్నత పురస్కారం ఇది. ఇండోనేషియా, భారత్ మధ్య ఉన్న చారిత్రక నాగరికతా బంధాలు, విడదీయరాని వ్యూహాత్మక విశ్వాసానికి ఇది నిదర్శనం” అని ప్రకటించారు. విద్యా, సాంస్కృతిక సంబంధాలను పెంపొందించే దిశగా ఐఐఎం బెంగుళూరు, పీటీ ఇంటెలిజెన్షియా గ్రహతామా మధ్య ఒక ఎంఓయూ కుదిరింది. అలాగే, ఇండోనేషియాలోని చారిత్రక ప్రంబనన్ ఆలయ సముదాయ పరిరక్షణ, పునరుద్ధరణ కోసం ఒక లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ను కూడా మార్చుకున్నారు. ఈ పరిణామాలు ఇరు దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేశాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ వార్త మీకు నచ్చిందా?.. నచ్చిన వార్తలను మీ మిత్రులతో కూడా పంచు

# రైతులకు రుణమాఫీ



63వ సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ వివరాలను పురపాలక శాఖ మంత్రి నారాయణ మీడియాకు వెల్లడించారు. రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని చెప్పడానికి ఈ నిర్ణయమే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. రైతులకు ప్రయోజనం చేకూర్చే మరిన్ని ముఖ్యమైన నిర్ణయాలకు కూడా ఈ సమావేశంలో ఆమోదముద్ర వేశారు. 2024 జూన్ నుంచి భూములు ఇచ్చిన రైతులకు పదేళ్లపాటు ఏటా రూ.40 వేలు కౌలుగా చెల్లించనున్నారు. గ్రామ కంఠాల్లో భూములు కోల్పోయిన వారికి ఏటా రూ.10 వేల చొప్పున పదేళ్లపాటు చెల్లింపులు జరపాలని నిర్ణయించారు. ఈ నిర్ణయాలతో భూములు ఇచ్చిన రైతులకు ఆర్థికంగా భరోసా లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అమరావతి పరిధిలోని ఈనాం భూములకు సంబంధించి దేవాదాయ శాఖకు రూ.159 కోట్లు చెల్లించే ప్రతిపాదనకు కూడా సీఆర్డీఏ ఆమోదం తెలిపింది. రాజధాని అభివృద్ధిలో భాగంగా అమరావతిలోని 25 టౌన్‌షిప్‌లలో ఒక్కో అంతర్జాతీయ పాఠశాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మరోవైపు, భూసమీకరణకు స్వచ్ఛందంగా ముందుకు రాని వారి విషయంలో కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంగళవారం రాత్రిలోగా భూములు ఇవ్వని వారి నుంచి మరుసటి రోజు నుంచే భూసేకరణ ప్రక్రియ ప్రారంభిస్తామని మంత్రి నారాయణ హెచ్చరించారు. ఇప్పటికే కొన్నిచోట్ల 2.5 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్లు అమలు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఒకవైపు రైతులకు భరోసా కల్పిస్తూనే, మరోవైపు అమరావతి నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు దోహదపడతాయని భావిస్తున్నారు.



# ఈ ఏడాది రాయల సీమకు ఎల్‌నినో దెబ్బ



ప్రాంతాలకు తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని సూచించారు. తాగునీరు, విద్యుత్ వంటి అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా చూడాలని, పోలీస్, అగ్నిమాపక, ఎన్డీఆర్ఎఫ్, ఏపీఎస్డీఆర్ఎఫ్ బృందాలు అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని మంత్రి అనిత దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షలో ఏపీఎస్డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్‌తో పాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులు కు క్రీడా పరికరాలు అందజేత



(నవతరం-మండపేట) విద్యార్థులు క్రీడల్లో రాణించాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు.మండపేట మండలం ద్వారపూడి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శారీరక దృఢత్వం క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేందుకు ఎస్ వి ఆర్ ఫౌండేషన్ చైర్మన్ సుంకర నాని రూ 17 వేలు సొంత నిధులతో సమకూర్చిన కోకో సెటిల్ సెట్స్ ను వేగుళ్ళ జోగేశ్వరరావు విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన అనపర్తి నియోజకవర్గ ఇన్ ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావు, సంస్థ సభ్యులు చిక్కాల శ్రీనివాసరావు, పళ్ళ సన్యాసిరావు, సాలాపు వీర వెంకట సత్యనారాయణ, చింతా శ్రీనివాసరావు, విద్యా కమిటీ చైర్మన్ కంకటాల మురళీకృష్ణ ప్రధానోపాధ్యాయురాలు బత్తిన రాజరాజేశ్వరి ఉపాధ్యాయులు భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ఒక ఎంపిక కాదు. అది ప్రాణ రక్షణ కవచం. మండపేట రూరల్ సిఐ దొరరాజు



(నవతరం-మండపేట) హెల్మెట్ ఒక ఎంపిక కాదనీ అది ప్రాణ రక్షణ కవచం అనీ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయని మండపేట రూరల్ సి ఐ పి దొరరాజు పేర్కొన్నారు.తూర్పు గోదావరి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండపేట రూరల్ సర్కిల్ పరిధి ద్వారపూడి గ్రామంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సి ఐ దొరరాజు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ఐ ఎస్ ఐ మార్క్ ఉన్న హెల్మెట్‌ను తప్పనిసరిగా స్ట్రాప్‌తో ధరించాలని సూచించారు. వాహనం నడిపేవారితో పాటు వెనుక కూర్చునేవారు కూడా హెల్మెట్ పెట్టుకోవాలని తెలిపారు. అతివేగం, డ్రైవింగ్ చేస్తూ ఫోన్ మాట్లాడటం వంటి వాటిని మానుకోవాలని పేర్కొన్నారు.ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారానే ప్రమాదాలను తగ్గించవచ్చని అన్నారు. కార్యక్రమంలో భాగంగా ఎస్ వి ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 180 హెల్మెట్లను వాహనదారులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఎస్ వి ఆర్ ఫౌండేషన్ చైర్మన్ సుంకర నాని, ఏ ఎస్ ఐ వైకుంఠరావు, హెచ్. శ్రీనివాస్, ప్రసాద్, అకుల సత్యనారాయణ, పి సి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ద్వారపూడిలో ఉచిత మెగా వైద్య శిబిరం.




(నవతరం-మండపేట) ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం ఆదర్శప్రాయమని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. పేద ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందించే లక్ష్యంతో ద్వారపూడి గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. దివంగత సుంకర వెంకట రమణ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సుంకర నాని ఎస్ వి ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరావు ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శమని కొనియాడారు. ద్వారపూడి గ్రామ ప్రజలతో పాటు మండపేట నియోజకవర్గంలోని పరిసర గ్రామాల ప్రజలు కూడా ఈ ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, అనపర్తి నియోజకవర్గ జన సేన ఇన్ ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావు,చిక్కాల శ్రీనివాసరావు,టిడిపి నాయకులు అడబాల బుల్లబ్బు, ఏ ఏం సి మాజీ చైర్మన్ చేకూరి రమేష్ రాజు, ద్వారపూడి టిడిపి అధ్యక్షులు సత్తి సత్యనారాయణ, జన సేన అధ్యక్షులు చింతా శ్రీనివాస్, పల్లా బాబు, సలాది బాల సుబ్రహ్మణ్యం, పల్లా వీరబాబు, ఫిషర్ మెన్ యూనియన్, ఆటో యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మందకృష్ణ పుట్టినరోజు వేడుకలు




( నవతరం-కొత్తపేట) కొత్తపేటలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.కొత్తపేట మండల ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ కముజు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా కొత్తపేట ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంచిపెట్టారు. చర్చిలలో ప్రార్థన చేశారు. కొత్తపేట నుండి పలివెల గ్రామం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కొత్తపేట పలివెలలో కేక్ కటింగ్ చేశారు. అనంతరం పలివెల గ్రామంలో అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎంఎస్పి నాయకులు యార్లగడ్డ సత్తిబాబు జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మర వీర రాఘవులు ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ క్రాప నాగరాజు రావులపాలెం మండల కొడమంచిలి చిరంజీవి కొత్తపేట మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు తొత్తరమూడి రాము ప్రధాన కార్యదర్శి నవ్వుంద్రి వెంకటేష్ మండల ఎమ్మార్పీఎస్ పెద్దలు నవుంద్రి ధనరాజు సత్యనారాయణ పల్లేరి తాతాజీ కుందుర్తి నాగేశ్వరరావు నవ్వుంద్రి జయరాజు పెప్పర సత్యానంద బాపూజీ ఉంద్రాజవరపు నాగేశ్వరరావు సిద్దుల కృపానందం నేదునూరి సత్యనారాయణ పులుసు గంటి జీవారత్నం కముజు నాగు గునపాటి గంగయ్య గుంజా మురళి తదితరులు పాల్గొన్నారు.

# జీవో 396 రద్దు చేయొద్దని డిమాండ్


### రెండో రోజు నిరసనలో సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం



బంగారుపాళ్యం (నవతరం) జూలై 07 మండలంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖరులు రెండో రోజు నిరసన కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా జీవో నెంబర్ 396ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మండల దస్తావేజు లేఖరుల సంఘం ఆధ్వర్యంలో సబ్ రిజిస్ట్రార్ యోగానంద్‌కు వినతిపత్రం సమర్పించారు. సంఘ అధ్యక్షులు బుస్సా నాగరాజుగౌడ్ మాట్లాడుతూ బంగారుపాలెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం 1982లో ప్రారంభమైందని, అప్పటి నుంచి లైసెన్సుడ్ దస్తావేజు లేఖరులు పనిచేస్తూ వచ్చారని తెలిపారు. అనంతరం రూ.100 ఆర్ఆర్ ఫీజుతో దరఖాస్తు లేఖరులు పనిచేసే విధానం అమల్లోకి వచ్చిందని చెప్పారు. ప్రస్తుతం లైసెన్స్ వ్యవస్థ లేకుండానే దస్తావేజు లేఖరులు తమ వృత్తిని కొనసాగిస్తూ ప్రజలకు సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో దస్తావేజులు తయారు చేసి, క్రయవిక్రయదారుల నుంచి పొందిన పారితోషికంతోనే తమ కుటుంబాలను పోషిస్తున్నామని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో జీవో 396 అమలు చేస్తే తమ జీవనోపాధి తీవ్రంగా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. దస్తావేజు లేఖరుల వల్ల ప్రభుత్వానికి ఎటువంటి నష్టం లేదని, వారు తయారు చేసే పత్రాల ద్వారా చలానాలు చెల్లించి ఆస్తుల రిజిస్ట్రేషన్ జరగడం వల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరుగుతోందని తెలిపారు. కాబట్టి దస్తావేజు లేఖరుల వ్యవస్థను యథావిధిగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు బుస్సా నాగరాజుగౌడ్, ఉపాధ్యక్షులు నాగేశ్వర్ లాల్, కార్యదర్శి సురేష్, ఉప కార్యదర్శి బి.ఆర్. హేమ ప్రసాద్, కోశాధికారి సుజాత, సభ్యులు రాజా, అభిరామ్, దినేష్, శివ, శీను, ఈశ్వర్, వంశీకృష్ణ, మురళి తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 9న బనగానపల్లెకు ముఖ్యమంత్రి చంద్రబాబు

### మీ భూమి- మీహక్కు కార్యక్రమానికి హాజరుకానున్న సీఎం



బనగానపల్లి /అమరావతి (నవతరం) జూలై 07: మీ భూమి- మీహక్కు కార్యక్రమంలో భాగంగా పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 9 తేదీన నంద్యాల జిల్లాలో పర్యటించనున్నారు. రీ సర్వే ప్రక్రియ పూర్తైన గ్రామాల్లోని రైతులు, భూ యజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ చేసేందుకు గానూ ముఖ్యమంత్రి బనగానపల్లె నియోజకవర్గంలో పర్యటించనున్నారు. జూలై 9 తేదీన రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేసే పట్టాదారు పాస్ పుస్తకాలతో కలిపి ఇప్పటి వరకూ ప్రభుత్వం 29 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేసినట్టు అవుతుంది. ఇప్పటివరకు 6,887 గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ పూర్తి చేసి 29.04 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రభుత్వం ముద్రించి పంపిణీ చేసింది. ఈ నెల రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 428 గ్రామాల్లో 2.48 లక్షల పట్టాదార్ పాస్ పుస్తకాల పరిశీలనను రెవెన్యూ శాఖ పూర్తి చేసింది. నంద్యాల జిల్లాలో 8,412 ఖాతా పుస్తకాలు, బనగానపల్లె నియోజకవర్గంలోని 1,125 పాస్ పుస్తకాలను రెవెన్యూ శాఖ సిద్ధం చేసింది. వచ్చే ఏడాది మార్చి నాటికి మిగిలిన 9,929 గ్రామాల్లోనూ సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇంకా 64.53 లక్షల రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయాల్సి ఉంది. మీ భూమి మీ హక్కు సమావేశం అనంతరం బనగానపల్లె పార్టీ కార్యకర్తలతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు.

**సీఎం బనగానపల్లె షెడ్యూలు వివరాలివి..:** ఈ నెల 9 తేదీన ఉదయం 10 గంటలకు అమరావతి నుంచి బనగానపల్లెకు ముఖ్యమంత్రి బయల్దేరి వెళ్లనున్నారు. 11.20కి బనగానపల్లె చేరుకుని స్థానిక తహసిల్దారు కార్యాలయానికి వెళ్లనున్న ముఖ్యమంత్రి అక్కడ ప్రజలకు అందుతున్న సేవలను నేరుగా పరిశీలించనున్నారు. అలాగే పలువురు రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు మీ భూమి- మీ హక్కు పేరిట పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, బహిరంగ సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.35 గంటలకు బనగానపల్లె నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. సాయంత్రం 4 గంటల తర్వాత ఆయన అమరావతికి బయల్దేరనున్నారు.

# లేపాక్షి సచివాలయంలో ఎస్ఐఆర్ డిజిటలైజేషన్‌పై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

### అలసత్వం వహిస్తే కఠిన చర్యలు - ఖచ్చితత్వంతో డేటా ఎంట్రీ చేయాలని ఆదేశం



లేపాక్షి/ పుట్టపర్తి (నవతరం) జూలై 07 శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఎ. శ్యామ్ ప్రసాద్ మంగళవారం లేపాక్షి సచివాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండలానికి చెందిన పోలింగ్ కేంద్రాల సంఖ్య 171 నుండి 180 వరకు ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ జరుగుతున్న విధానాన్ని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. సచివాలయంలోని కంప్యూటర్ వ్యవస్థల ద్వారా జరుగుతున్న డేటా ఎంట్రీ ప్రక్రియను కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించి, సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందికి పలు ముఖ్య సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విభాగానికి సంబంధించిన ఈ ప్రక్రియ అత్యంత కీలకమని, ఎలాంటి చిన్నపాటి పొరపాట్లు చోటుచేసుకోకుండా అత్యంత జాగ్రత్తగా, ఖచ్చితత్వంతో డేటా ఎంట్రీ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన కాలపరిమితి లోపల నాణ్యతతో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న డిజిటలైజేషన్ పనులను ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, సిబ్బందికి తగిన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. ఎక్కడైనా అలసత్వం కనబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి తహసిల్దార్ సౌజన్య లక్ష్మి, ఎంపీడీఓతో పాటు స్థానిక ఎన్నికల విభాగపు సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## చిన్నారి మృతి ఘటనపై డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విచారణ - వైద్యుల నిర్లక్ష్యంపై తల్లిదండ్రుల ఆరోపణలు

బుట్టాయిగూడెం (నవతరం) జూలై 07 మండలంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో చిన్నారి మృతి ఘటనపై డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుమతి విచారణ నిర్వహించారు. మండల పరిధిలోని మోతుగూడెం గ్రామానికి చెందిన గోగుల శ్రీ రిత్విక (4) జ్వరంతో మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని మిగిల్చింది. పాపకు కొద్ది రోజులుగా జ్వరం ఉండగా, చికిత్స చేసినప్పటికీ ఆరోగ్యం మెరుగుపడలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈనెల 4వ తేదీ రాత్రి బాలికను బుట్టాయిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అయితే అక్కడ కూడా జ్వరం తగ్గకపోవడంతో వైద్యులు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే పాప మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ కుమార్తె మృతి చెందిందని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ ఘటనపై స్పందించిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుమతి బుట్టాయిగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, వైద్య సిబ్బందితో మాట్లాడి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. ఈ ఘటనపై పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.




## ఎంపీఎస్ స్కూల్లో ఎన్నికల తరహాలో పోలింగ్ కార్యక్రమం.




(నవతరం- మండపేట) చిన్నతనం నుంచే విద్యార్థులకు ప్రజాస్వామ్య వ్యవస్థ, ఓటు విలువ, ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో మండపేటలోని ఎంపీఎస్ పాఠశాలలో వినూత్న కార్యక్రమం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలను తలపించేలా పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ఓటరు జాబితా, బ్యాలెట్ విధానం, ఓటింగ్ ప్రక్రియను అనుసరిస్తూ విద్యార్థులతో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. విద్యార్థులే తమ నాయకులను ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా హాజరైన ఎంఈవోలు నాయుడు రామచంద్రరావు, చింతా సోమిరెడ్డి లు మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే ప్రజాస్వామ్య విలువలను అలవర్చడం ఎంతో అవసరమన్నారు. ఇటువంటి వినూత్న కార్యక్రమాల ద్వారా పిల్లల్లో బాధ్యతాయుతమైన పౌరసత్వ భావన పెంపొందుతుందని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ఆచరణాత్మక అవగాహన కల్పించడంలో ఎంపీఎస్ పాఠశాల నిర్వాహకులు తీసుకున్న చొరవ అభినందనీయమని కొనియాడారు. ఎన్నికల అనంతరం ఓట్ల లెక్కింపు నిర్వహించి విజేతలను ప్రకటించారు. స్కూల్ హెడ్ బాయ్ గా కె.నాగ అభినవ్, హెడ్ గర్ల్ గా పి.నందిని, డిప్యూటీ హెడ్ బాయ్ గా ఎస్. ఆదిత్య, డిప్యూటీ హెడ్ గర్ల్ గా కె. జ్యోత్స్న, హౌస్ కెప్టెన్స్ గా ఎస్. నిఖిల్, కే. జనార్దన్, బి. సాత్విక్ పాల్, వి. అఖిలేష్, హౌస్ వైస్ కెప్టెన్స్ గా కే. ఈశ్వర్, ఎం. లాశ్విన్ రాయ్, పి. హర్షిత, డి. పద్మ ప్రియలు ఎన్నికవ్వగా వీరికి ఎంఈవో లు బ్యాడ్జి లు అందజేశారు. విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం మిమ్మల్ని గెలిపించిన విద్యార్థులకు మీరు ఏం చేస్తారంటూ విజేతలను ఎంఈవో సరదాగా ప్రశ్నించారు. అందుకు వారు విద్యార్థులకు ఏ సమస్యలు వచ్చినా పరిష్కరిస్తామని, మౌలిక వసతులు అవసరం అయితే యాజమాన్యంతో మాట్లాడుతామని సమాధానం ఇవ్వడంతో వారిని ఎంఈవో అభినందించారు. చిన్నప్పటి నుండి ఇలాంటి తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంపీఎస్ విద్యా సంస్థల అధినేత వల్లూరి చిన్నారావు మాట్లాడుతూ పాఠ్యాంశాలతో పాటు సామాజిక బాధ్యతలను కూడా విద్యార్థులకు పరిచయం చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏఓ లు కొప్పాక హేమాంబిక, మానేపల్లి కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

# భగవంతుని సొమ్ముపై పారదర్శకత ఉండాలి.



**(నవతరం-మండపేట)** దేవుని సొమ్ము ప్రతీ పైసాకు లెక్క ఉండాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. మండపేట నియోజకవర్గంలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని దేవాలయాల ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ల తో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. దేవస్థానాల ఆదాయ, వ్యయాలను ఆయా దేవస్థానాల చైర్మన్ లతో కలసి పరిశీలించారు. ఈ సమావేశంలో ఆలయాల ఆర్థిక నిర్వహణ, పారదర్శకతపై ఎమ్మెల్యే కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ దేవుని సొమ్ముకు ప్రతి పైసా లెక్క ఉండాలని పేర్కొన్నారు. ఆలయాల ఆదాయ-వ్యయాల నిర్వహణలో పూర్తి పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. భక్తులు సమర్పించే కానుకలు, విరాళాలు దుర్వినియోగం కాకుండా పక్కాగా రికార్డులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆలయాలకు రావాల్సిన లీజు బకాయిలు, దుకాణాల అద్దెలను సకాలంలో వసూలు చేయాలన్నారు. దీర్ఘకాలికంగా ఉన్న బకాయిదారులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆలయాల అభివృద్ధి, ఆర్థిక పటిష్టత కోసం ఈఓలు, చైర్మన్లు, ట్రస్ట్ బోర్డు సభ్యులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దేవాలయాల నిధులను సక్రమంగా వినియోగిస్తూ, ఆలయాల అభివృద్ధికి కట్టుబడి పనిచేసే అధికారులకు, కమిటీలకు తన పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే వేగుళ్ల ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ముఖ్యంగా ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. ఈ సమావేశానికి పసలపూడి, నదురుబాద, మాచవరం గ్రామాలకు సంబంధించిన ఈఒలు హాజరుకాకపోవటంతో ఈఒల పరిధిలో ఉన్న దేవస్ధానాల రికార్డులను రెండు రోజులలోపు తీసుకురావాలని ఎమ్మెల్యే ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ ను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, ఎండోమెంట్స్ ఇన్స్పెక్టర్ బాలాజీ, నియోజకవర్గంలోని వివిధ ఆలయాల ఈఓలు, చైర్మన్లు, దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# భూ రీ సర్వే, పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ 22-ఏ భూముల సమస్యలపై జిల్లాల వారీగా ఉన్నతా ధికారుల కీలక సమీక్ష

- **రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, సీసీఎల్ఏ జి. జయలక్ష్మి నేతృత్వంలో వీడియో కాన్ఫరెన్స్;**
- **పాల్గొన్న కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియా దేవి**



**(నవతరం -అమలాపురం జూలై 7)** రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే, 22-ఏ నిషేధిత భూముల జాబితా సవరణ, కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ మరియు ఐవీ ఆర్ఎస్ కాల్స్ ద్వారా అందుతున్న ప్రజా ఫిర్యా దుల పరిష్కార పురోగతిపై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు మంగళవారం ఒక ఉన్నత స్థాయిలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించా రు.?రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జి. జయలక్ష్మి సంయుక్తంగా విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో జిల్లాల వారీగా క్షేత్రస్థాయి పురోగతిని సమీ క్షించారు. ఈ కాన్ఫరెన్స్‌లో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుండి జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియా దేవి జిల్లా అధి కారులతో కలిసి పాల్గొన్నా రు.?ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ జి. సాయి ప్రసాద్ మాట్లాడు తూ.రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న భూ రీ సర్వే ప్రక్రియను అత్యంత పారద ర్శకంగా, గడువులోగా పూర్తి చేయాలని ఆదేశిం చారు. భూ రికార్డుల ప్రక్షాళన ద్వారా రైతులకు శాశ్వత భూ హక్కులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. 22-ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్న అర్హులైన రైతుల దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, చట్టపరమైన నిబంధనల ప్రకారం పరిష్కరించాలని స్పష్టం చేశారు. పాస్ పుస్తకాల పంపిణీలో ఎలాంటి అలసత్వం వహించరాదని, ఐవీ ఆర్ఎస్ కాల్స్ ద్వారా వచ్చే భూ సమస్యల ధృవీకరణ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు.?వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులను ఉద్దేశించి జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియా దేవి ప్రసంగిం చారు. జిల్లాలో జరుగుతు న్న భూ పరిపాలన సంస్క రణల వివరాలను ఆమె వెల్లడించారు. కోనసీమ జిల్లాలో భూ రీ సర్వే ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు క్షేత్రస్థాయిలో రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రికార్డులను పక్కాగా క్రోడీకరించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ నూతన పట్టాదార్ పాస్ పుస్తకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుం టున్నామన్నారు. జిల్లాలో 22-ఏ పరిధిలో ఉన్న భూములకు సంబంధించి రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తు న్నామన్నారు నిబంధనల ప్రకారం అర్హత ఉన్న భూములను డీ-నోటిఫై చేసేందుకు ప్రతిపాదన లను వేగవంతం చేశామ న్నారు రీ సర్వే తుది రికార్డులు ల్యాండ్ రిజిస్టర్లు తయారైన వెంటనే ముద్రిం చిన కొత్త పాస్ పుస్తకాలను పారదర్శకంగా పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు రీ సర్వే మరి యు భూ సేవలపై నేరుగా రైతుల నుంచి సేకరిస్తున్న ఐవీఆర్ఎస్ కాల్స్ ఫీడ్‌బ్యాక్‌ను ఎప్పటికప్పుడు విశ్లే షిస్తున్నామని,. రైతులు వ్యక్తం చేస్తున్న సందేహాలు, ఫిర్యాదులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేలా రెవెన్యూ మరియు సర్వే సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామ న్నారు ?ఈ సమీక్షా సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వి సుబ్బారావు జిల్లా సర్వే శాఖ అధికారి కే ప్రభాకర్ ఆర్డీవో ఏ సరళా వతి ఉప తహశీల్దార్లు వంశీ మరియు రెవెన్యూ విభాగపు ముఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

# గీత కార్మికులు, వెనుకబడిన వర్గాల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తోంది





**( నవతరం- రాజమహేంద్రవరం)** రాష్ట్రంలోని అన్ని వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యంగా గీత కార్మికులు, వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం పలు కీలక నిర్ణయాలను అమలు చేస్తున్నట్లు రాష్ట్ర గనులు, భూగర్భశాఖ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని మంజీరా హోటల్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్,ఇతర కూటమి నాయకులతో కలిసి మంత్రి మాట్లాడారు. ప్రజలకు సుపరిపాలన అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ క్రమంలో గీత కులాలైన శెట్టిబలిజ, గౌడ, యాత, శ్రీశయన వర్గాల ఆర్థికాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని నూతన మద్యం విధానంలో మద్యం దుకాణాల కేటాయింపులో 10 శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీ అందిస్తున్నట్లు చెప్పారు. బార్ల కేటాయింపులోనూ 10 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. గీత కార్మికుల సామాజిక భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ, చెట్లపై నుంచి పడి ప్రమాదవశాత్తు మరణించిన గీత కార్మికుల కుటుంబాలకు కార్మిక శాఖ నుంచి రూ.5 లక్షలు, ఎక్సైజ్ శాఖ నుంచి రూ.5 లక్షలు కలిపి మొత్తం రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న 33 కేసులకు త్వరలోనే పరిహారం అందించే చర్యలు చేపట్టినట్లు చెప్పారు. అలాగే 50 సంవత్సరాలు దాటిన గీత కార్మికులకు పెన్షన్ అందించడం తమ ప్రభుత్వ విశిష్ట కార్యక్రమమని పేర్కొన్నారు. పోలవరం జిల్లాలోని పందిరిమామిడి ఉద్యాన పరిశోధన కేంద్రాన్ని అధికారులతో కలిసి సందర్శించినట్లు మంత్రి తెలిపారు. అక్కడ సుమారు 200 రకాల తాటి జాతులపై పరిశోధనలు కొనసాగుతున్నాయని, నీరా పానీయం ఉత్పత్తి, నిల్వ, కోల్డ్‌చైన్ ఏర్పాటుతో పాటు బెల్లం, పౌడర్, స్పిరిట్, స్వీట్నర్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై పరిశోధనలు జరుగుతున్నాయని చెప్పారు. వీటిని అంతర్జాతీయ మార్కెట్‌కు అనుసంధానం చేసి గీత కార్మికులకు మెరుగైన ఆదాయం అందేలా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి గోవా, కేరళ తరహాలో విశాఖపట్నం, సూర్యలంక తీర ప్రాంతాల్లో బీచ్ షాక్స్ విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా స్టార్ హోటళ్లతో అనుసంధానించి, పర్యాటకాభివృద్ధికి తోడ్పడేలా ఈ విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ శ్రీధర్ మాట్లాడుతూ పందిరిమామిడి ఉద్యాన పరిశోధన కేంద్రంలో నీరా ఉత్పత్తి, నిల్వ, మార్కెటింగ్ విధానాలతో పాటు తాటి ఆధారిత ఉప ఉత్పత్తుల తయారీ ప్రక్రియలను పరిశీలించినట్లు తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి తాటి బెల్లం వంటి ఉత్పత్తులను మరింత విలువతో మార్కెట్‌కు అందించే అవకాశాలను అధ్యయనం చేస్తున్నామని, తద్వారా గీత కార్మికుల ఆదాయాన్ని పెంచే చర్యలు చేపడతామని పేర్కొన్నారు. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. గౌడ తదితర గీత కులాల అభ్యున్నతి కోసం మద్యం దుకాణాల్లో 10 శాతం రిజర్వేషన్, లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీ వంటి నిర్ణయాలు ప్రభుత్వ సామాజిక నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు. ఈ సమావేశంలో శెట్టిబలిజ కార్పొరేషన్ కుడిపూడి సత్తిబాబు, గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు

# కదిరిలో మైనర్ బాలిక మిస్సింగ్ - కేసు నమోదు, దర్యాప్తు ప్రారంభం

**కదిరి (నవతరం) జూలై 07** పట్టణంలో మైనర్ బాలిక మిస్సింగ్ ఘటన నమోదు కావడంతో స్థానికంగా కలకలం రేగింది. వికలాంగుల క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న ఎం. సుశీల (50), భర్త రాజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల వివరాల ప్రకారం, సుశీల కుమార్తె ఎం. కీర్తన (16) కదిరి టౌన్ గర్ల్స్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతోంది. నిన్న తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో కాలకృత్యాల నిమిత్తం బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఎటువంటి సమాచారం లభించలేదని తెలిపారు. ఈ ఘటనపై అదే ప్రాంతానికి చెందిన బాబా అనే వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలికను గుర్తించేందుకు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నామని, ఎవరైనా సమాచారం తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కదిరి పట్టణ సీఐ నారాయణరెడ్డి కోరారు.

# వర్షాకాలంతో ఏజెన్సీ గ్రామాల్లో జ్వరాల ముప్పు - రోగులతో నిండుతున్న ఆసుపత్రి వార్డులు



**బుట్టాయిగూడెం (నవతరం) జూలై 07** మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో వర్షాకాలం ప్రారంభంతో జ్వరాలు విస్తరిస్తున్నాయి. వరుస వర్షాల కారణంగా గ్రామాల్లో ప్రజలు జ్వరాల బారిన పడుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలోని పలు ఏజెన్సీ గ్రామాల నుంచి జ్వరంతో బాధపడుతున్న వారు పెద్ద సంఖ్యలో బుట్టాయిగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలివస్తున్నారు. దీంతో ఆసుపత్రిలోని వార్డులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. జ్వరాలు ఎక్కువగా వ్యాపించడం వల్ల గ్రామాల్లో ఆందోళన నెలకొంది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఎక్కువగా ప్రభావితమవుతున్నట్లు తెలుస్తోంది. వైద్యసిబ్బంది రోగులకు చికిత్స అందిస్తున్నప్పటికీ, రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ప్రజలు పరిశుభ్రత పాటిస్తూ, నిల్వ నీటిని తొలగించాలని, జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ఆసుపత్రిని సంప్రదించాలని వైద్యులు సూచిస్తున్నారు.

# గడువులోపు ఓటర్ వెరిఫికేషన్ పూర్తి చేయాలి - నల్లచెరువు తహసీల్దార్ రవి నాయక్ హెచ్చరిక



**నల్లచెరువు (నవతరం) జూలై 07** మండలంలో జరుగుతున్న ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమంపై తహసీల్దార్ రవి నాయక్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బూత్ నంబర్ 223ను సందర్శించిన ఆయన, అక్కడ బీఎల్ఓల పనితీరును సమీక్షించారు. వెరిఫికేషన్ ప్రక్రియలో ఆలస్యం జరుగుతుండటంపై అసంతృప్తి వ్యక్తం చేసిన తహసీల్దార్, సిబ్బందిని గట్టిగా హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపే పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అవసరమైతే ఉన్నతాధికారుల నుంచి సలహాలు, సూచనలు తీసుకుని కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమం పూర్తిగా పూర్తి చేయాలని, ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని తహసీల్దార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు పాల్గొనగా, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, బూత్ నంబర్ 223 కన్వీనర్ వి.ఎం. భాష కూడా హాజరయ్యారు.

# మత్తు వ్యతిరేక చిత్రలేఖన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ - చైల్డ్ ఆర్టిస్ట్ అవార్డులు అందజేత



**బంగారుపాళ్యం (నవతరం) జూలై 07** వాణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన మత్తు పదార్థాల నియంత్రణ చిత్రలేఖన పోటీల్లో బంగారుపాళ్యం సెయింట్ మేరీ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. 6వ తరగతి విద్యార్థిని దక్షిణ్య, 3వ తరగతి విద్యార్థిని ప్రద్యుతి "చైల్డ్ ఆర్టిస్ట్ అవార్డు"ను సాధించారు. మంగళవారం బంగారుపాళ్యం సీఐ కత్తి శ్రీనివాసులు చేతులమీదుగా విజేతలకు ప్రశంసాపత్రాలు మరియు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, వినియోగం చట్టరీత్య నేరమని స్పష్టం చేశారు. ఎవరైనా మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్న సమాచారం పోలీసులకు అందిస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత్తు నియంత్రణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థలను అభినందించారు. ఈ సందర్భంగా విజేత విద్యార్థులను సీఐ ప్రత్యేకంగా అభినందించారు.

*Printed by SIRIGIRI VARADARAJU and Published by SIRIGIRI VARADARAJU on behalf of SIRIGIRI VARADARAJU,and Printed at: Kanthi Publications, Door No:2-504/1,Adityanagar colony,Arasavalli, Srikakulam, Andhra Pradesh State,532401, India,Printed and Published and Owned by SIRIGIRI VARADARAJU Door No:18-11-12/1,Krishnanagar, Rajamahendravaram,East Godavari*